


(గత సంచిక తరువాయి)

**మిగిలినవారితోపాటు** ఆ నలుగురూ మెట్లెక్కి ఓ చెక్క కాటేజ్‌లోకి వెళ్ళారు. అక్కడున్న ఉద్యోగి వెళ్ళినవారి సంఖ్యని, తిరిగి వచ్చినవారి సంఖ్యని నమోదు చేసుకుని కొత్తవాళ్ళని పంపుతున్నాడు. వీకెండ్ కాబట్టి విదేశస్థులతో రష్‌గా ఉంది. ఓ తెల్లవాళ్ళ బృందం మాట్లాడే భాష విని చైత్ర చెప్పింది.

"వీళ్ళు స్పెయిన్‌నించి వచ్చారు."

"నీకు స్పేనిష్ భాష కూడా వచ్చా?" ఆద్య అడిగింది.

"పూర్తిగా రాదు. ఆ భాష ధ్వనిని మాత్రం గుర్తుపట్టగలను. అమెరికాలో స్పేనిష్ మాట్లాడే మెక్సికన్స్ ఎక్కువ. మా ఫెసిలిటీలో వాళ్ళు చాలామంది పనిచేసేవాళ్ళు. అన్నట్లు ఇలియా వాళ్ళింటికి రేపు ఆదివారం డిన్నర్‌కి పిలిచింది. ఏడున్నరకి అక్కడుండాలి. మనింటినించి జస్ట్ ఫైవ్ మినిట్ వాక్."

తమ వంతు రాగానే ముందు ఎన్రికో, వెనక ఇద్దరు అమ్మాయిలు, వారి వెనక ఐజాక్ నడిచారు. నడుస్తూంటే ఆ వంతెన అటు, ఇటు ఊగుతూ ఆద్యకి భయాన్ని కలిగించింది. వెడల్పు అడుగున్నరే కాబట్టి ఓ మనిషిని ఇంకో మనిషి దాటి వెళ్ళే అవకాశం లేదు. అటు, ఇటు ఐదడుగుల ఎత్తుకి పిట్టగోడలా అడ్డుగా కట్టిన తాళ్ళ పై భాగంలో పట్టుకుని ముందుకి నడిచారు. ఎటు చూసినా లోయ, పచ్చదనం, చెట్ల శిఖరాలు కనిపిస్తున్నాయి. కింద లోయని చూస్తేకాని తాము ఎంత పైనున్నారో వారికి అర్థం కాలేదు. సగం దూరం వెళ్ళాక వంతెనమీంచి ఓ చెట్టుకి అర్ధచంద్రాకారంలో చెక్కలతో ఏర్పరిచిన ప్లాట్‌ఫాం మీదకి వెళ్ళి నించుని ఇతరులకి దారిని ఇవ్వచ్చు. సేద తీరచ్చు. చుట్టూ ప్రకృతిని చూడచ్చు.

చైత్ర అక్కడ ఆద్యకి ఫోటోలు తీసింది. ఎన్రికో అక్కాచెల్లెళ్ళు ఇద్దరికీ ఫోటోలు తీసాడు. ఐజాక్‌కి కూడా. కిందెక్కడైనా మృగాలు కనపడతాయేమోనని చూసే వారికి ఐజాక్ లేళ్ళ బృందాన్ని, నెమలిని చూపించాడు. పది నిమిషాల తర్వాత వాళ్ళు ఆ కెనోపీ చివరకి చేరుకుని మళ్ళీ ఆ కాటేజ్‌లోంచి మెట్లు దిగి బయటకి వచ్చారు. ఇమ్మాన్యుయల్ అంతా వచ్చేదాకా ఎదురుచూసాడు. ఓ జంట ఐదు నిమిషాలు ఆలస్యం చేసారు.

"మా ఆఫ్రికాలో మడగాస్కర్‌లో బేవోబాబ్ వృక్షాలు చాలా ఉన్నాయి. దాన్ని ట్రీ ఆఫ్ లైఫ్ అంటారు. దానికి రంధ్రం చేస్తే నీటి రిజర్వాయర్‌లా లోపల నీళ్ళుండి దాహం తీరుస్తాయి. దానిమీద కురిసిన వర్షాన్ని ఆ చెట్టు పీల్చుకుంటుంది. దాని పండుకి పెంకు ఉంటుంది. పెంకుని పగలకొడితే లోపల తెల్లటి బ్రెడ్‌లాంటి తీపి, పులుపు పల్ప్ ఉంటుంది. దాన్ని ఆహారంగా తినొచ్చు. వాపుకి కడితే వాపు తగ్గుతుంది. దాని గింజలనించి నూనెని తీస్తారు. దాని లేత ఆకులతో సూప్ చేస్తారు. పచ్చివి కూడా తింటారు. ఈ చెట్టు బెరడు బాగా దళసరిగా ఉంటుంది. దీని కాండం చుట్టుకొలత పది మీటర్లదాకా ఉంటుంది. కొందరు అందులో నివశిస్తారు. ఓ కాండంలో నడిచే బార్‌కి వెళ్ళాను. అతి పెద్ద దాంట్లో నలభైమంది కూడా పడతారు. అడవి అంటుకున్నా దీనికేం కాదు. తర్వాత మళ్ళీ చిగురిస్తుంది. అది చాలా దూరంలో ఉంది. కాని మనకి అక్కడికి వెళ్ళొచ్చే సమయం లేదు" గైడ్ చెప్పాడు.

"ఇది మన దేశంలో ఉంటే గంగానదిలా, ఆవులా దీన్ని కొలిచేవారు" చైత్ర నవ్వి చెప్పింది.

ఆలస్యం చేసిన జంట తిరిగి రాగానే ఆ బృందం ఇమాన్యుయల్‌ని అనుసరించింది.

"ఇక్కడో ట్రీ హౌస్ కూడా ఉంది. దాని ఎత్తు ఎంతో గెస్ చేయగలరా? రెండు వందల ఏభై అడుగులు. ఒకేసారి పాతికమంది అందులో బస చేయచ్చు. ఈ అడవిలోనే కుకుం నది పుట్టింది. అందుకని ఈ ఫారెస్ట్‌కి అదే పేరు పెట్టారు. దీనికి ఏడు  ఉపనదులున్నాయి. మనం ఇప్పుడు జలపాతం దగ్గరకి వెళ్తున్నాం" గైడ్ చెప్పాడు.

ఆ జలపాతాన్ని చూసి అక్కాచెల్లెళ్ళిద్దరూ పడీపడీ నవ్వారు. అది మూడడుగుల ఎత్తుగల అతి చిన్న జలపాతం. ఎత్తిపోతలని చూసినవారికి అది జలపాతమంటే నవ్వొచ్చింది.

"మీరు ఎందుకు నవ్వారో నాకు అర్థమైంది" ఎన్రికో కూడా నవ్వి చెప్పాడు. "ఈ అడవిలో నూట ఐదు రకాల ప్లాంట్స్, ఏభై ఏడు రకాల చెట్లు, పది రకాల పొదలు, తొమ్మిది రకాల తీగలు, పదిహేడు రకాల ఔషధ మొక్కలు, పన్నెండు రకాల గడ్డి ఉన్నాయి. కొన్ని ఫెర్న్స్, ఆర్చిడ్స్ కూడా ఉన్నాయి. చక్కటి పాటలు పాడే పక్షుల్లేకపోతే అడవి ఎంత నిశ్శబ్దంగా ఉంటుందో?" గైడ్ చెప్పాడు.

గైడ్ వారిని వచ్చినదారిలో మళ్ళీ బయలుదేరిన చోటికి తీసుకెళ్ళి చెప్పాడు.

"దయచేసి మా హస్తకళల షాప్‌లో కొని మా కళాకారులని ప్రోత్సహించండి. విదేశస్తులు తప్ప స్థానికులు వాటిని కొనరు. వారికి ఈ వృత్తి తప్ప మరేదీ తెలియదు. ఇది తరతరాలుగా వస్తున్న కళ. మీ వల్ల అది కొనసాగుతుంది. గుడ్ డే."

అందరితోపాటు చైత్ర, ఎన్రికోలు గైడ్‌కి చెరో పాతిక సిడిలని టిప్‌గా ఇచ్చారు.

ఆ నలుగురూ మిగిలిన వారితోపాటు షాప్‌లోకి వెళ్ళారు. ఎక్కువగా చెక్కతో చేసిన బొమ్మలు అమ్ముతున్నారు. అన్నీ ఆఫ్రికన్ ఫీచర్స్ గల నల్ల మనుషుల బొమ్మలే.

రోజ్‌వుడ్‌తో చేసిన మూడడుగుల ఎత్తైన ఆఫ్రికన్ మహిళ, దానికి తెలుపు, ఆకుపచ్చ పూసలతో నడుం నించి మోకాళ్ళదాకా అల్లిన టైట్ స్కర్ట్ ఉంది. మహిళ తలమీద ఆ రంగు పూసలతోనే చేసిన టోపీ. దాని మీద కుండ. పక్కనే చేతిలో ఈటెతో ఆఫ్రికన్ మగాడు. ఆ జంట బొమ్మలని చైత్ర కొన్నది. జంతువుల మెడలో కట్టే చెక్క గంటని ఆద్య ఎంచుకుంది. తమ ఇంటి బాల్కనీలో కట్టడానికి గాలికి కదిలి చప్పుడు చేసే విండ్ చైమ్స్ ని చైత్ర కొన్నది. వెదురు గొట్టంలోని కర్రనాలికలు లోపలి భాగాన్ని గాలికి తాకి మృదువైన శబ్దం చేస్తున్నాయి. ఏష్ట్రేలు, కోస్టర్స్, వెజిటబుల్ కటర్స్, డబ్బాలు లాంటి గృహోపకరణ వస్తువులు కూడా చాలా కనిపించాయి.

రెస్టరెంట్‌లో బిస్కెట్స్ తిని, టీ తాగాక మళ్ళీ బయలుదేరారు.

"నీకీ ఫారెస్ట్ ఎలా ఉంది?" ఎన్రికో ఆద్యని అడిగాడు.

"చాలా బావుంది. ప్రకృతి ఎప్పుడూ అందంగా ఉండి అక్కడే ఆగిపోవాలనిపిస్తుంది" ఆద్య చెప్పింది.

సరిగ్గా నలభై నిమిషాల్లో ఎస్‌యువి కేప్ కోస్ట్‌కి చేరుకుంది. దారిలో ఇందాకటి ఆడ కూలీలు వారి బండిని గుర్తుపట్టి నవ్వుతూ చేతులు ఊపారు. టైం చూసుకుని ఐజాక్ చెప్పాడు.

"ముందు లంచ్ తిని తర్వాత కోటకి వెళ్ళండి. ఇక్కడ బ్రిటీష్ రెస్టరెంట్‌లో ఫిష్ అండ్ చిప్స్ దొరుకుతాయి. పీజా జాయింట్ కూడా ఉంది. కాని అది అంత బావుండదని విన్నాను. ఇథోపియన్ రెస్టరెంట్ ఉంది."

"ఇంకేం? ఇథోపియన్‌కి వెళ్దాం. ఆ దేశం క్యుజిన్‌లో అనేకం సౌత్ ఇండియన్ వంటకాల్లా ఉంటాయి. పెసలతో చేసిన పప్పు, కందిపప్పు, ఆకుకూర కేబేజ్ కూర ఉంటాయి. అన్నం బదులు ఇంజెరా అని మన దోసెల్లాంటివి ఇస్తారు. అది మెయిన్ ఫుడ్. ఆ దోసెల్లో వాటిని నంజుకుని తినాలి. చిక్కనైన చాలా కారంగా ఉండే మాంసం స్ట్యూతో ఇంజెరాని తినాలి" చైత్ర చెప్పింది.

చైత్ర బ్లూ నైల్ రెస్టరెంట్ పక్కనే ఉన్న చర్చ్ బయటున్న బోర్డ్‌ని చూపించి ఎన్రికోతో చెప్పింది.

"తెలివిగా లేదూ?"

'మోర్ దేన్ 2000 ఇయర్స్ ఓల్డ్. స్టిల్ అండర్ ది సేం మేనేజ్‌మెంట్ ' అని ఆ బోర్డ్ మీద ఉంది.

రెస్టరెంట్‌లో అలంకారంగా ఆఫ్రికన్ మేప్, నైల్ నది, ఆడిస్ అబాబాలోని హోలీ ట్రినిటీ కేథడ్రిల్, మెర్కెటో (మార్కెట్) ఫోటోలు గోడలకి అలంకరించాఉర్. ఫుడ్ ఆర్డర్ని ఇచ్చాక వెయిటర్ ప్లేట్స్ పెట్టి వెళ్ళాడు. ఎన్రికో ఆ మూడిటినీ ఒళ్ళో దాచాడు. వెయిటర్ బౌల్స్‌తో వచ్చి ప్లేట్స్‌లేని బల్లవంక అయోమయంగా చూసి, తను వాటిని పెట్టలేదనుకుని వెనక్కి తిరిగి వెళ్ళి మళ్ళీ తెచ్చి ఉంచాక ఎన్రికో ప్లేట్లని ఒళ్ళోంచి తీసి చూపించాడు. ఆ నల్ల వెయిటర్ సన్నగా నవ్వాడు.

"ఇంజెరా ఎలా చేస్తారు?" ఎన్రికో వెయిటర్ని అడిగాడు.

"టెఫ్ అనే ఆఫ్రికాకి పరిమితమైన గింజలతో చేసే పిండితో సార్. ఆ పిండిని ఫెర్మెంట్ చేస్తారు."

అతను వెళ్ళాక ఎన్రికో ఆ గింజల గురించి గూగుల్ చేసి ఆ ఫోటోని అక్కా చెల్లెళ్ళకి చూపించి చెప్పాడు.

"ఇథోపియాలో టెఫ్ గింజలు ప్రధానాహారం. ఇది ట్రియా, ఇథోపియా దేశాల్లో పండుతుంది. ప్రపంచంలోని తొంభై శాతం టెఫ్ ఈ దేశాలో ఉత్పత్తి చేస్తాయి. ఇవి చాలా చిన్న గింజలు. వెయ్యి గింజలు ఒక గ్రాము బరువు కూడా ఉండవు. త్వరగా ఉడుకుతాయి. కాబట్టి ఇంధనం ఖర్చు బాగా తగ్గుతుంది. ఫెర్మంట్ చేసిన పిండితో దోసెలు వేస్తారు."

వెయిటర్ చిన్న స్టెయిన్‌లెస్ స్టీల్ గిన్నెల్లో వడ్డించిన అరడజను కూరలని తెచ్చి ప్లేట్‌లో ఉంచి, వాటి మధ్యలో మడిచిన దోసెలని ఉంచడు. వారికి తెలీని హెర్బ్స్ వేసి వండిన కేబేజ్, బంగాళాదుంప, కేరట్స్ కలిపి చేసిన కూర ముగ్గురికీ నచ్చింది. మటన్ స్ట్యూ మాత్రం కారంగా ఉండి ఎన్రికో తినలేకపోయాడు. కాని అక్కాచెల్లెళ్ళిద్దరూ ఇష్టంగా తిన్నారు.

"కందిపప్పు అమ్మ చేసినట్లులా లేదు కదా?" చైత్ర అడిగింది.

"అవును. అమ్మ ఇంత పలచగా  చెయ్యదు."

"చాలా ఇథోపియన్ రెస్ట్‌రెంట్లకి బ్లూనైల్ అనే పేరే పెడతారు. ఎందుకో?" తిన్నాక చైత్ర ఆలోచనగా చెప్పింది.

ఎన్రికో వెంటనే గూగుల్ చేసి తన ఫోన్‌ని ఆమెకి ఇచ్చాడు. చైత్ర బయటకి చదివింది.

"బ్లూ నైల్ నది ఇథోపియాలో పుట్టి సూడాన్‌లో వైట్ నైల్ నదితో కలుస్తుంది. బ్లూ నైల్ నది నీళ్ళు నల్లగా ఉంటాయి. నలుపుని వారు నీలం అంటారు కాబట్టి ఆ పేరు వచ్చింది. వైట్ నైల్ నీళ్ళు సాధారణ నీళ్ళల్లా ఉంటాయి. కాబట్టి దాన్ని వైట్ నైల్ అన్నారు."

"మా దేవుళ్ళు రాముడు, కృష్ణుడు కూడా నల్లగా ఉంటారు. వారిని నీలం రంగులో చిత్రిస్తారు" ఆద్య చెప్పింది.

"ప్రపంచంలోని అతి పొడవైన నది ఏదో తెలుసా?" ఎన్రికో అడిగాడు.

"అమెజాన్" ఆద్య చెప్పింది.

"నైల్ నది. అమెజాన్ రెండో పొడవైన నది. అమెజాన్ నదిమీద ఎక్కడా వంతెనల నిర్మాణం జరగలేదు. ఆఫ్రికాలోని కాంగో నది ప్రపంచంలోని అతి లోతైన నది. సింధు నదికి 'ఫాదర్ ఆఫ్ ఆల్ రివర్స్' అని పేరు."

ఆద్యకి ఓ విషయం ఆ ఐదారు రోజుల్లో స్పష్టంగా అర్థమైంది.  జాగ్రఫీ కాని, మరేదైనా కాని చైత్రకి, ఆమె మిత్రులందరికీ కొత్త విషయం తెలుసుకోవాలనే ఆసక్తి సమానంగా ఉంది. గూగుల్ చేసి వెంటనే తెలుసుకుంటారు. కాని ఇలా తెలుసుకోవాలని అనుకోవడం తనలోకాని, తన మిత్రుల్లో కాని లేదు. అవన్నీ తాము బోర్‌గా ఫీలయ్యే సంగతులు. రాజకీయాలు కూడా బోరే, బదులుగా సినిమాలు, సినిమాలు, సినిమాలు. వాటి గురించి, హీరో హీరోయిన్స్ గురించి, వెబ్‌సైట్లలోని వారిమీది గాసిప్‌ల గురించే తమకి ఆసక్తి.

"ఇలా తెలుసుకోవడం వల్ల ఉపయోగం ఏమిటి?" ఆద్య అడిగింది.

"జీవితంలోని గొప్ప నష్టం చావు కాదు. జీవితంలోని గొప్ప నష్టం తెలుసుకోవాలనే ఆసక్తి లేకపోవడం. నిన్నటి నువ్వే ఈ రోజు నువ్వు కాకూడదు. నేటి నువ్వే నువ్వు. ఈరోజు నువ్వు కలిసే ప్రతీవారినించి నీకు తెలీనిది తెలుసుకుని రేపటికి ఎదగాలి. 'నేను చాలామంది' అని బర్మీస్ సామెత. ప్రతీవారిలో చాలామంది ఉంటారు. అవన్నీ కలిస్తేనే మనం అవుతాం. గతంలో ఎన్నడూ ఎవరికీ లేని సౌకర్యం మనకి ఇప్పుడు అందుబాటులో ఉంది సమాచారం. తద్వారా నాలెడ్జ్‌ని ఇంప్రూవ్ చేసుకునే అవకాశం. ఏ సమాచారమైనా  క్షణాల్లో మనకి లభ్యమవుతోంది. ఏదైనా ఇంగ్లీష్ పదానికి అర్థం తెలుసుకోవాలన్నా, ఓ జండా ఏ దేశానికి చెందిందని తెలుసుకోవాలన్నా, ఫలానా రోజు ఏం జరిగింది అని తెలుసుకోవాలన్నా వెంటనే ఆ సమాచారం గూగుల్లో సెర్చ్ చేసి నేర్చుకోవడం మంచి అలవాటు" ఎరిక్ చెప్పాడు.

"అవేం వంటల రెసిపిలా? వాటివల్ల ప్రాక్టికల్‌గా ఏం ఉపయోగం?" ఆద్య అడిగింది.

"కొన్ని అర్థం అవడానికి కొంత ప్రపంచజ్ఞానం అవసరం. ఉదాహరణకి 'భోజనానికి బ్రిటన్ బెస్ట్ ప్లేస్. తిన్నప్పుడల్లా పౌన్లు తగ్గిపోతుంటాయి' అనే జోక్ అర్థం అవాలంటే, బ్రిటన్‌లోని కరెన్సీని పౌన్లు అంటారని తెలియాలి. అది తెలిస్తేనే ఆ జోక్‌ని ఎంజాయ్ చేయగలం. మేము పనిచేసే స్క్లంబర్జె కంపెనీలో అనేక దేశాలకి చెందిన ఆయిల్ బేస్డ్ వర్కర్స్ పనిచేస్తున్నారు. మా కంపెనీని ఒక దేశంగా, మేమంతా అందులో అంతర్జాతీయ పౌరులుగా భావిస్తాం. మేమంతా రక్తసంబంధీకులం అనుకుంటాం. మేమంతా అనేక దేశాల్లో పనిచేస్తూంటాం. కాబట్టి మాకు జాగ్రఫీ, వివిధ దేశాల్లోని ఆచారవ్యవహారాలు, ఆహార అలవాట్లు, అనేక రంగాలకి చెందిన వర్తమాన వార్తలులాంటివి తెలుసుకునే ఆసక్తి సహజంగా ఉంటుంది. అవన్నీ మాకు ఉద్యోగనిర్వహణలో, జీవితంలో ఉపయోగపడతాయి. ఉదాహరణకి ఒకో దేశంలో ఒకోటి మర్యాద. మన దేశంలో ఆపోజిట్ సెక్స్‌ని పబ్లిక్‌గా ముట్టుకోకూడదు. పాశ్చాత్యదేశాల్లో ఆడ, మగ కలిసినప్పుడు, విడిపోయేప్పుడు హగ్ చేసుకోవడం సంప్రదాయం. చైనాలో గొడుగు కాని, గడియారం కాని బహూకరించకూడదు. సింగపూర్‌లో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో తినకూడదు. చిలీ దేశంలో చేతులతో తినకూడదు. టర్కీలో థంప్సప్ సైన్‌ని చూపించకూడదు. కెన్యాలో ఎవర్నీ మొదటి పేరుతో పిలవకూడదు. నార్వేలో 'చర్చ్‌కి వెళ్దామా?' అని అడక్కూడదు. యు.కెలో ఎంత సంపాదిస్తున్నారని అడక్కూడదు. న్యూజిలాండ్‌లో కార్ హార్న్‌ని మోగిస్తే అది ప్రజలని అవమానించినట్లు. జర్మనీలో పుట్టినరోజుకిముందు రోజే గ్రీటింగ్స్ చెప్పకూడదు. ఐర్లండ్‌లో ఐరిష్ ఏక్సెంట్‌ని అనుకరించకూడదు. ఉజ్బెకిస్థాన్ దేశంలోని సౌకర్యం రోడ్‌మీద వెళ్ళే ఏ కారుని చూసి చెయ్యెత్తి ఆపినా అది పదినించి ఇరవై కిలోమీటర్ల దూరానికి టేక్సీగా మారుతుంది. కారు యజమానులు కొంత రుసుము తీసుకుని దింపుతారు. ఇలా కొత్త సమాచారాన్ని విసుగు కలగకుండా సరదాగా తెలుసుకునేందుకు ట్రివియా, ఫైవ్ సెకండ్స్ మొదలైన చాలా గేమ్స్ ని కూడా కనిపెట్టారు" చైత్ర చెప్పింది.

వారి సంభాషణని విన్న ఎరిక్ చెప్పాడు.

"దేహానికి ఎక్సర్‌సైజ్ ఎలాగో మైండ్‌కి సమాచారం తెలుసుకోవడం అలా. మా నాన్న మాకు ఆలోచించడం నేర్పారు. మా నాన్న మాకు జీవితంలోని అత్యంత శక్తివంతమైనది ఆలోచనా విధామనమని చెప్పేవారు. అదెలాంటి సందర్భాన్నైనా మార్చగలదు. జీవితాన్ని సౌకర్యవంతంగా చేయగలదు. ఉదాహరణకి ఇంటి నిర్మాణంలో బాత్‌రూంలో స్టాండప్ షవర్ గది విస్తీర్ణం ఎంతుండాలి? రెండు అడుగులు చాలన్నాడు మా కంట్రాక్టర్. నేను చాక్‌పీస్‌తో ఎల్ షేప్ గోడముందు రెండు అడుగుల చతురస్రం గీసి గోడవైపు ఒంగుని చూసాను. ఆ విస్తీర్ణంలో గోడ తగలకుండా ఒంగలేం. షవర్‌లో సబ్బు కిందపడితే వంగి తీసుకోవాలిగా, మూడున్నర అడుగుల విస్తీర్ణంలోనే సౌకర్యవంతంగా ఒంగగలం. 'థింక్. థింక్, థింక్. ఆలోచనే శక్తి, ఆలోచనే సంపద. ఆలోచనే సౌకర్యాన్నిచ్చేది' అని మా నాన్న మాకు బోధించేవారు. ఆలోచనలకి సమాచారం పునాది. నాకు, నా తమ్ముడికీ బోర్ కొడితే ప్రతీసారి గ్లోబ్ ముందు కూర్చుని దేశ రాజధానులు, ఏ దేశం కాలనీలు ఏవో గుర్తించడంలాంటి ఓ రేండం టాపిక్‌ని ఎన్నుకుని ఆటని ఆడేవాళ్ళం. దాన్ని 'బోర్‌డం బస్టర్ గేం' అనేవాళ్ళం."

"ఈ థింక్ యు ఆర్ రైట్. నేనెప్పుడూ ఇలా ఆలోచించలేదు" ఆద్య చెప్పింది.

"కొత్త భాషలు నేర్చుకోవడం, సుడోకు, క్రాస్‌వర్డ్ పజిల్స్ మొదలైనవన్నీ బ్రెయిన్‌కి ఎక్సర్‌సైజ్లు. బ్రెయిన్‌లోని గ్రే మేటర్ని పెంచుతాయి. దాంతో మోర్ ఏక్టివ్ అండ్ షార్ప్ బ్రెయిన్. శరీరానికి నడక ఎలాగో బ్రెయిన్‌కి అలా ఎక్సర్‌సైజ్ అవసరం. కలరింగ్, కనెక్ట్ డాట్స్ పజిల్స్‌ని కలపడం, పుస్తకాల్లోని చిందరవందర చతురస్రాల్లోని పదాలని వెదకడం,రూబిక్ స్క్యూబ్, చదరంగంలాంటివి బ్రెయిన్‌లోని న్యూరాన్స్‌ని కనెక్ట్ చేస్తాయి. అవి ఎంతగా కనెక్టైతే అంత ఆలోచనా పరిధి విస్తరిస్తుంది .చైనాలో రిటైరైన ముసలివాళ్ళు, ఇస్తాంబుల్‌లో టీ షాప్స్‌లో ముసలివాళ్ళు బ్రైన్ వీటా, చైనీస్ చెకర్స్ లాంటి బోర్డ్ గేమ్స్ ని ఆడతారు. నేను కూడా వీకెండ్స్‌లో ఆన్‌లైన్‌లో కొత్తవాళ్ళతో కనీసం మూడు గంటలు చదరంగం ఆడతాను. టెడ్ టాక్‌ని వింటే ఆలోచనల్లోని పరిధి విస్తరిస్తుంది" చైత్ర చెప్పింది.

ఎన్రికో నవ్వుతూ చెప్పాడు.

"ఇప్పుడే తెలివితేటలమీద గూగుల్ చేసాను. కొత్తవి నేర్చుకోవడం వల్ల మన మెదడులోని లక్షల న్యూరాన్స్ ఒకదాన్ని మరొకటి కనెక్ట్ చేస్తాయి. అవి ఎంత ఎక్కువగా కనెక్టైతే అంతగా ఆలోచనా పటిమ పెరుగుతుందన్నది కరెక్టే. అందుకే ఇది ఉపయోగిస్తుందా, లేదా అని చూడక ఆల్‌మోస్ట్ మేమంతా కొత్తవి నేర్చుకుంటాం. చాలా తరచు అలా నేర్చుకున్నవి ఉపయోగించి ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి."

"అంటే ప్రపంచంలోని ఏ విజ్ఞానానికైనా  మనకి ఉపయోగించేదే. కాకపోతే అది మనకి తెలీనంతకాలం దాన్ని ఉపయోగించమన్నమాట. ఉదాహరణకి విమానంలోని కిటికీ బ్లైండ్‌ని ఎప్పుడు తెరవాలి? ఎందుకు మూసి ఉంచాలి? లాంటిది తెలుసుకుంటే ఏర్‌హోస్టెస్ చెప్పకుండానే మనకది తెలుస్తుంది" చైత్ర చెప్పింది.

"ఇంకా విజ్ఞానం బాధని తగ్గిస్తుంది. అజ్ఞానం ఇమోషనల్ ఇంటలిజెన్స్‌ని ఇవ్వలేదు కనుక మనం ఆ స్థితిలో ఎక్కువ బాధని అనుభవిస్తాం" ఎన్రికో చెప్పాడు.

లంచ్ చేసాక ఎన్రికో వెయిటర్‌కి పెద్ద టిప్‌ని ఇచ్చాడు.

"నువ్వు నేప్ కిన్‌ని ఎందుకు ఒళ్ళో వేసుకోలేదు?" చైత్ర అడిగింది.

"నా మీద నాకు నమ్మకం ఉంది కాబట్టి" ఎన్రికో నవ్వుతూ చెప్పాడు.

వాహనంలో ఐదు నిమిషాల దూరంలోని కేప్ కేజిల్‌కి వెళ్ళారు. ఐజాక్ ఫోర్ట్ బయటి కారాపి వాళ్ళని దింపి కోరాడు.

"నేను ఫోర్ట్‌ని చాలాసార్లు చూసాను సర్. నా స్వగ్రామం ఇక్కడికి రెండు కిలోమీటర్లు."

"సరే. వెళ్ళు. నేను ఫోన్ చేసినప్పుడు రా" ఎన్రికో ఒప్పుకున్నాడు.

ప్రవేశ రుసుం ఘానా పౌరులకి ఐదు సిడిలు, విదేశస్థులకి నలభై సిడీలు. మూడంతస్థుల తెల్లటి భవంతి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎంట్రన్స్‌లోని కౌంటర్లో చైత్ర టిక్కెట్లని కొన్నది. ఆ ముగ్గురూ టికెట్ కౌంటర్ దాటి కోటలోకి వెళ్ళగానే ఎదురుగా విశాలమైన స్థలం, దాని అవతల సముద్రం వైపు గురిపెట్టబడ్డ పన్నెండు పాతకాలం ఫిరంగులు కనిపించాయి. కుడివైపు సైనికుల బేరక్స్.

ఇన్‌షర్ట్ చేసుకున్న ఓ నలభై ఏళ్ళ నల్లతని ముందు పాతికమంది దాకా నల్లవాళ్ళు, తెల్లవాళ్ళు గుమికూడి ఉన్నారు. వారిలో ఇందాక కుకుం ఫారెస్ట్‌లో స్పేనిష్ వాళ్ళని ఆద్య గుర్తుపట్టింది. అతను వీళ్ళని చూసి చెప్పాడు.

"గుడ్ మార్నింగ్. వెల్ కం టు కేప్ కేజిల్. ఐ యాం యువర్ గైడ్. నా పేరు బాకో. అంటే మొదట పుట్టినవాడు అని అర్థం. ఘానాలో పాపులర్ పేరిది. ప్లీజ్ జాయిన్ ది టూర్. ఇంకో ఐదు నిమిషాల్లో దాన్ని ఆరంభిస్తాను."

ఈలోగా మరో ఇద్దరు నల్లవాళ్ళు వచ్చారు. వారు మాట్లాడే భాష విని చైత్ర చెప్పింది.

"వీళ్ళు ఫ్రెంచ్ వాళ్ళు. ఏదో ఫ్రెంచ్ కాలనీనించి వచ్చారు."

పది నిమిషాల తర్వాత బాకో చెప్పసాగాడు.

"ఓకె. లెట్స్ స్టార్ట్. భూగోళాన్ని మేప్‌లో నాలుగు హెమిస్ఫియర్స్‌గా విభజించారు. ఆఫ్రికా ఖండం ఎంత పెద్దదంటే, ఆ నాలుగూ ఆఫ్రికా ఖండంలోనే ఉన్నాయి. బానిసత్వం ఆఫ్రికన్స్‌కో శాపం. వాళ్ళని బానిసలుగా ఉపయోగించాలనుకున్నది నిజానికి తెల్లవారు కాదు. వారికి మునుపే వెస్ట్ ఆఫ్రికన్స్‌లోని బలమైనవారు తోటి బలహీన ఆఫ్రికన్స్‌ని బంధించి బానిసలుగా అమ్మే చెడ్డ సంప్రదాయం ఉండేది. ఏనుగు దంతాలు, బంగారం, ఇతర వస్తువుల వ్యాపారాలకోసం యూరోపియన్స్ ఆఫ్రికాలో కాలు పెట్టారు. కాని ఆఫ్రికన్ వ్యాపారస్థులే తోటి ప్రజలని కిడ్నాప్ చేసి యూరోపియన్ వ్యాపారస్థులకి బానిసలుగా అమ్మసాగారు. న్యూ వరల్డ్‌లోని వ్యవసాయ తోటల్లో లేబర్ డిమాండ్

ఉండటంతో బానిసలు కూడా ప్రధాన ఆదాయ వనరులై, తెల్లవాళ్ళు వారిని ఖండాంతరం  పంపించడానికి దారి తీసింది. మీరు వెస్ట్ ఆఫ్రికాలోని ఇలాంటి నలభై కేజిల్స్‌లో ఒకదాన్ని చూస్తున్నారు. ఇది వాటన్నిటికన్నా అతి పెద్ద కేజిల్. దీని విస్తీర్ణం ఇరవై మూడువేల చదరపు అడుగులు.  ఆఫ్రికాలో ఈ కేప్ కేజిల్‌నించే బానిసల ఎగుమతి అధికంగా జరిగింది. ఇది బానిసల రవాణాలో ఆఖరి ఎంబార్కేషన్ స్టేషన్. ఇక్కడే ఓడలోకి వారిని ఎక్కించేవారు.

"క్రీస్తు శకం 1526లో వెస్ట్ ఆఫ్రికానించే మొదటి బానిసల ఓడ అమెరికాకి చేరుకుంది. తోటల్లో పనిచేయడానికి వారికి అక్కడ అవసరమైనంత లేబర్ లభ్యం కాకపోవడంతో ఆఫ్రికన్స్‌ని అక్కడికి వ్యాపార సరుకుగా తరలించారు .నేను చెప్పేది పూర్తయ్యాక మీ అనుమానాలని అడగండి. ఓకే? ముందుగా కేప్ కేజిల్ చరిత్ర. 'స్వీడిష్ ఆఫ్రికా కంపెనీ' దీన్ని 1653లో నిర్మించింది. ఎస్. స్వీడిష్ నావికులు ఇక్కడికి వచ్చారు. ఆనాటి కింగ్ ఆఫ్ ఫెటూ దీని నిర్మాణానికి అనుమతి ఇచ్చాడు. వాళ్ళు దీనికి పెట్టిన పేరు కార్ల్స్‌బోర్గ్ ఫోర్ట్. ఈ కేజిల్‌ని టింబర్, గోల్డ్ రవాణా పర్యవేక్షణకి  కట్టారు. తర్వాత ప్రధానంగా ఆఫ్రికన్ బానిసలని ఎగుమతి చేయడానికి ఉపయోగించారు. 1657లో దీన్ని డేనిష్ వెస్ట్ ఇండియా కంపెనీ ఆక్రమించింది. తర్వాత డచ్‌వారు, వారినించి మళ్ళీ స్వీడిష్ వారు లాక్కున్నారు. 1663లో కింగ్ ఆఫ్ ఫెటూ మరణించాక 1664లో ఇది బ్రిటీష్ వారి చేతుల్లోకి వచ్చింది .సెవెన్ ఇయర్స్ వార్లో 1757లో ఫ్రెంచ్ వారు దీనిమీద దాడి చేయడంతో ఈ కోట బాగా పాడైంది. దాంతో 1797లో ఇంగ్లండ్‌నించి ఇటుకలని దిగుమతి చేసుకుని, బానిసలని బంధించే ప్రదేశాన్ని పెంచి దీన్ని పునర్నిర్మించారు. వాళ్ళు దీనికి పెట్టిన 'కేప్ కోస్ట్ కేజిల్' పేరు స్థిరపడింది. అప్పటినించి ఘానాకి స్వతంత్రం వచ్చేదాకా వారి ఆధీనంలోనే ఉంది. వెనక్కి చూడండి."

చూస్తే తాము దాటి వచ్చిన మూడంతస్థుల చాలా పెద్ద తెల్ల భవంతి కనిపించింది.

"దీన్నే వాళ్ళు నిర్మించింది. ఈ కోటనించి ఎంతమంది ఆఫ్రికన్ బానిసలు పంపబడ్డారో మీరు ఊహించగలరా?" బాకో అందరివంకా చూస్తూ అడిగాడు.

"పదివేలు?" ఓ తెల్ల యువతి అనుమానంగా సూచించింది.

"ఇట్స్ గేం. నో గూగుల్ ప్లీజ్" అతను గూగుల్ చేసే ఆమె భర్తవంక చూస్తూ నవ్వుతూ మందలించాడు.

"సిక్స్ హండ్రెడ్ థౌజండ్?" అతను ఫోన్ మూసేసి అనుమానంగా చెప్పాడు.

"ట్వల్వ్ మిలియన్. ఎలా తెలుసంటే యూరోపియన్స్, ముఖ్యంగా బ్రిటీష్ వారు రికార్డ్‌లని క్షుణ్ణంగా మెయిన్‌టైన్ చేసేవారు."

వెంటనే ఆద్య మనసులో 'అమ్మో! కోటి ఇరవై లక్షలమంది. అది హైదరాబాద్ జనాభా కన్నా ఎక్కువ' అనుకుంది.

"మీలో ఎవరైనా లండన్ డంజన్లని చూసారా?" గైడ్ కంఠాన్ని సీరియస్‌గా మార్చి అడిగాడు.

"నేను ఉండేది లండన్‌లోనే. నా చిన్నప్పుడు చూసాను" ఓ బ్రిటీష్ దేశస్థుడు చెప్పాడు.

మరో ఇద్దరు చైనీస్ పర్యాటకులు వచ్చారు.

"మీలో హార్ట్‌కి సంబంధించిన రోగులెవరైనా ఉన్నారా? లేరా? గుడ్. ఉంటే నా సూచన వాళ్ళని బయటే ఉండమని. మనం ఇప్పుడు ఈ కోటలోని ప్రధాన ఆకర్షణైన స్లేవ్స్ డంజన్‌లోకి వెళ్తున్నాం."

అంతా బాకోని అనుసరించారు. అతను గుమ్మం దగ్గర ఆగి చెప్పాడు.

"మనం డంజన్ ఎంట్రన్స్ ముందున్నాం. డంజన్ అంటే భూగర్భ ఖైదు. రవాణా ఓడ వచ్చేదాకా కొని తెచ్చిన బానిసలని ఇక్కడ బంధించి ఉంచేవారు. మిగిలిన నలభై కోటల్లోని డంజన్స్ కన్నా ఇది అతి పెద్దది. అతి పెద్దది. అతి చీకటైంది. అతి అమానుషమైంది. మీలో ఎవరికైనా కష్టాలున్నాయా? అది ఎంత చిన్న కష్టమైనా కావచ్చు. ఇందాక వస్తూంటే కంట్లో నలక పడుండచ్చు. లేదా బండి ఎక్కబోయే ముందు మీ భార్యతో పోట్లాడి ఉండచ్చు. ఆస్థి తగాదాలుండొచ్చు. పూటకి గడవని పరిస్థితిని మీరు చూసుండచ్చు. కష్టాలున్నవారు చేతిని ఎత్తండి."

అంతా ఎత్తారు. ఆద్య మాత్రం ఎత్తలేదు. గైడ్ ఆమెని చూసి నవ్వుతూ చెప్పాడు.

"మీరు సెయింట్లై ఉంటారు. లోపలికి పదండి."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com

www.telugubooks.in

Post your comments